క్లుప్తంగా

31 నుంచి ప్రసన్న వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



మోతీనగర్: మూసాపేట డివిజన్ పాండురంగ నగర్‌లో శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 31 నుంచి జూన్ 2వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి జీఏకే కృష్ణసోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి అనుగ్రహం పొందాలని కోరారు.

ముగిసిన వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

మోతీనగర్: దేవాలయాలు మానసిక ప్రశాంతతకు కేంద్ర బిందువులుగా నిలుస్తాయని టీపీసీసీ కార్యవర్గ సభ్యుడు సత్యం శ్రీరంగం పేర్కొన్నారు. శ్రీవివేకానందనగర్‌లోని శ్రీభూనీల సమేత శ్రీవేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ పులిగొల్ల శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ... మినీ తిరుపతిగా పేరు గాంచిన ఈ స్వామివారిని దర్శించుకుంటే కోరిన కోర్కెలు నెరవేరుతాయని అన్నారు. ఈ పూజల్లో యాదవరెడ్డి, దస్తయ్య, శ్రీలక్ష్మి, అంజమ్మ, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చెరువు శిఖం భూములను పరిరక్షించాలి

సుభాష్‌నగర్: కబ్జాలకు గురవుతున్న చెరువుల శిఖం భూములు పరిరక్షించాలని తెలంగాణ మత్స్యసహకార సంఘాల చైర్మన్ పిట్టల రవీందర్ ఆధ్వర్యంలో సోమవారం కుత్బుల్లాపూర్ మండల తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూరారం కట్టమైసమ్మ ఆలయం ఎదురుగా ఉన్న లింగా చెరువు పూర్తిగా కబ్జా చెరలో చిక్కుతుందన్నారు. నలుదిక్కులా ఆక్రమిస్తూ చెరువును లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు స్పందించి చెరువును కాపాడాలని మత్స్యకారుల ఉపాధికి భరోసా కల్పించాలన్నారు. సూరారం మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు మారి గణేష్ ముదిరాజ్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ముదిరాజ్ సంఘం ప్రధాన కార్యదర్శి సుంకరి సాయిప్రతాప్ ముదిరాజ్, తేళ్ల బాలరాజ్ ముదిరాజ్, బక్కని పాండురంగ ముదిరాజ్, అంజయ్య ముదిరాజ్, మన్నె ముత్యాలు, సారగూడెం లక్ష్మణ్ రమేష్ తదితరులు ఉన్నారు.

ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తాం

కుత్బుల్లాపూర్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తామని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. 'హాథ్ సే హాథ్ జోడో'యాత్రలో భాగంగా సోమవారం గాజులరామారం డివిజన్ పరిధిలోని చంద్రగిరినగర్, ఇందిరనగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన స్థానికంగా నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

◆ ఈ సందర్భంగా హన్మంతరెడ్డి మాట్లాడుతూ.. తమ హయాంలోనే పేదలకు రాజీవ్‌గృహకల్ప, ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇచ్చామన్నారు. ప్రస్తుత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లుగా డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లను ఇవ్వకుండా పేదలకు అన్యాయం చేస్తోందన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే పేదవారికి ఇంటి నిర్మాణం చేసుకునేందుకు ఒక్కొక్కరికి రూ.5 లక్షలు ఇస్తామన్నారు. నాయకులు జేమ్స్, జహంగీర్, సంజీవరెడ్డి, వెంకటేష్, గణేష్, లాయక్, శ్రీనివాస్‌గుప్తా, అంజద్, రాధా, శారదా తదితరులు పాల్గొన్నారు.

జూన్ 1 నుంచి ఉచిత కుట్టు శిక్షణ తరగతులు

జగద్గిరిగుట్ట: దుర్గాబాయి మహిలా శిశు వికాస కేంద్రం ఆధ్వర్యంలో జూన్ 1న భూదేవి హిల్స్‌లో ఉచిత కుట్టు శిక్షణా కేంద్రం, బ్యూటీషియన్ ప్రారంభం కానుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమం ఎమ్మెల్యే కేపీ వివేకనంద్ చేతుల మీదుగా ప్రారంభమవుతుందన్నారు. ఈ కోర్సు 45 రోజుల పాటు కొనసాగుతుందని వారు తెలిపారు. అందులో పాల్గొనడానికి ఆసక్తి ఉన్న వారు 9492755668 సంప్రదించాలని కోరారు. 14 – 20 ఏళ్ల వరకు ఉన్న వారు శిక్షణలో పాల్గొనవచ్చని తెలిపారు.

తెలంగాణ అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

దుండిగల్: బీఆర్ఎస్ పాలనతో అన్ని వర్గాల ప్రజలు అసంపూర్తిగా ఉన్నారని.. తెలంగాణలో కుటుంబ పాలనకు చరమగీతం పాడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి అన్నారు. గాజులరామారం వడ్డెర సంఘం అధ్యక్షుడు మోహన్ కృష్ణ, టీపీసీసీ మైనార్టీ రాష్ట్ర కో.కన్వీనర్ సమీర్‌ఖాన్ ఆధ్వర్యంలో సోమవారం భారీ ఎత్తున యువత భూపతిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా యుతకు కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు.

పెట్రోల్ దొంగలు ఉన్నారు.. జాగ్రత్త

- కూకట్‌పల్లి సర్కిల్, జగద్గిరిగుట్ట ఠాణా పరిధిలో హల్‌చల్
- ఖాళీ అవుతున్న బైక్‌ల ట్యాంకులు
- సీసీ ఫుటేజీ పరిశీలిస్తే బయటపడ్డ అసలు విషయం





సీసీ కెమెరా ఫుటేజీల్లో పెట్రోల్ దొంగలు

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి సర్కిల్, జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆల్విన్‌కాలనీ, తులసీనగర్‌లలో పెట్రోల్, బైక్ దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. అర్ధరాత్రి దాటిన తర్వాత నుంచి రెండు నెలలుగా ప్రతి రోజు దొంగలు, పోకిరీలు, మందుబాబులు పగలు ఇళ్ల ముందు తిరుగుతూ రాత్రి వేళల్లో దొంగతనాలకు పాల్పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. తెల్లవారే సరికి బైకుల్లో పెట్రోల్ ఉండడం లేదని తెలుపుతున్నారు. ప్రతి రోజు ఇలాగే జరగడంతో వాహనదారులు సీసీ కెమెరాలను పరిశీలించారు. దొంగలు రాత్రి వేళల్లో బైకుల్లోని పెట్రోల్ దొంగలిస్తున్న దృశ్యాలను కనిపించడంతో ఖంగుతున్నారు. ఆల్విన్ కాలనీ చుట్టు పక్కల ప్రాంతాల్లోని వారే ఉంటారని చెబుతున్నారు.

◆ గతంలో కూడా ఈ ప్రాంతంలో ఇళ్లకు తాళాలు వేసి ఉన్న ఇళ్లలో చొరబడి విలువైన బంగారు నగలు, సొమ్ములను దోచుకుపోయిన సంఘటనలు కూడా ఉన్నాయని పేర్కొంటున్నారు. దొంగలను పట్టుకోవడానికి ప్రయత్నిస్తే వారిపై దాడులకు దిగిన సంఘటనలు ఉన్నాయని తెలుపుతున్నారు.

◆ అంతేకాక ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో కొత్తగా ఇళ్లు నిర్మించే ఇళ్లల్లో విలువైన వస్తువులు దొంగిలించుకుపోయిన సంఘటనలు కూడా ఉన్నాయని పేర్కొంటున్నారు. సీసీ కెమెరా ద్వారా పరిశీలిస్తే పెట్రోల్ దొంగిలిస్తున్న దొంగలు తిరిగే ఫుటేజీలు కూడా కనిపిస్తున్నాయని పలువురు తెలుపుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు ఈ ప్రాంతాల్లో గట్టి నిఘా ఏర్పాటు చేసి పెట్రోల్ దొంగలను గుర్తించి చర్యలు తీసుకోవాలని స్థానిక సంక్షేమ సంఘం సభ్యులు, ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

కార్పొరేటర్ల పర్యటన | సమస్యల పరిశీలన

నేరుగా సమస్యలు తెలుసుకుంటున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం

మోతీనగర్: పాదయాత్ర చేపట్టిన సందర్భంగా అల్లాపూర్ డివిజన్‌లోని పలు బస్తీ, కాలనీల ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబిహా బేగం సోమవారం ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లి అధికారులకు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... స్థానికులు తెలిపిన సమస్యలను అధికారులు త్వరగా పరిష్కరించాలని కోరానన్నారు. డివిజన్ పరిధిలోని రామారావు నగర్‌లో నివసిస్తున్న ఓ మహిళకు సోమవారం కార్పొరేటర్ కల్యాణలక్ష్మి చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఎస్సీసెల్ అధ్యక్షుడు జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

అవంతినగర్‌తోటలోని సమస్యలను పరిష్కరిస్తా



అవంతినగర్‌తోటలోని పర్యటిస్తున్న మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్

మోతీనగర్: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశాల మేరకు సోమవారం మూసాపేట మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ అవంతినగర్ తోట, ఈస్ట్‌లలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక సమస్యలను తెలుసుకుని త్వరగా పరిష్కారిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సీహెచ్ సత్యనారాయణ, అంబటి శ్రీనివాస్, నాగుల సత్యం, తిరుపతి, మోహన్‌రెడ్డి, రుద్రగౌడ్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో 16వేల మందికి కల్యాణలక్ష్మితో లబ్ధి



కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: నియోజకవర్గంలోని 53 మంది కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు సోమవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలను అందించడంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ముందున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దారన్నారు. నేడు దేశంలోని అన్ని రాష్ట్రాలు తెలంగాణను ఆదర్శ రాష్ట్రంగా తీసుకుంటున్నాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలే దేశంలో పేర్లు మార్చి పెడుతున్నారని అన్నారు. నిరుపేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయే మహానాయకుడు ముఖ్యమంత్రి కేసీఆర్ అని అన్నారు ఇప్పటి వరకు కూకట్‌పల్లి నియోజకవర్గంలో దాదాపు 16 వేల మంది లబ్ధిదారులకు కల్యాలక్ష్మి చెక్కులు అందించామని తెలిపారు.

బంజారా సేవాలాల్ సేన బాచుపల్లి నూతన కమిటీ

నిజాంపేట్: బంజారా సేవాలాల్ సేన బాచుపల్లి మండల అధ్యక్షుడిగా ముడవత్ గోపాల్ నాయక్ ఎన్నికయ్యారు. ఆదివారం బాచుపల్లిలో జరిగిన సమావేశానికి తెలంగాణ రాష్ట్ర సేవాలాల్ సేన అధ్యక్షుడు అంగోత్ రాంబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ రఘురాం రాథోడ్ లు ముఖ్య అతిథులుగా హాజరై నూతన కమిటీని ప్రకటించారు. యువలాల్ సేవ సేన అధ్యక్షుడిగా మూడవత్ రవి నాయక్, సేవాలాల్ సేన ధర్మ పరిరక్షణ సమితి అధ్యక్షుడిగా సత్యనారాయణనాయక్, కార్మిక సేవాలాల్ సేన అధ్యక్షుడిగా జాటోతు పాండు నాయక్, సేవాలాల్ సేన మండల ఉపాధ్యక్షుడిగా కాట్రావత్ కృష్ణ నాయక్, గౌరవ అధ్యక్షుడిగా రాథోడ్ సంతోష్ నాయక్, వైస్ ప్రెసిడెంట్లుగా శ్రీనివాస్ నాయక్, రతన్ రాథోడ్, ధరావత్ వినోద్ నాయక్, కట్రావత్ కృష్ణ నాయక్, ప్రధాన కార్యదర్శిగా సభావత్ బాలాజీ నాయక్‌లను నియమించారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ బంజారా సేవా సంఘం అధ్యక్షులు బంజారా సేవల సంఘం అధ్యక్షుడు రాములు నాయక్, ప్రధాన కార్యదర్శి పరమేష్ నాయక్, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎల్ఐజీ ప్లాట్స్‌లోని పార్కుల నిర్వహణ శూన్యం

జిల్లా బీజేపీ అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి



సమస్యను తెలుసుకుంటున్న పన్నాల హరీష్‌రెడ్డి, వడ్డేపల్లి రాజేశ్వరరావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గం కేపీహెచ్‌బీ, బాలాజీనగర్ డివిజన్‌లలోని ఎల్ఐజీ ప్లాట్స్ ప్రాంతాల్లో స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు మేడ్చల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పేరుతో అక్రమాలకు పాల్పడడం తప్ప పార్కులు... పార్కు ఆవరణలో మందు సీసాలు ఉన్నాయని.. అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాలుగా మారాయని అన్నారు. అభివృద్ధి చేశామని పబ్లిసిటీ చేసుకొని ఫ్లెక్సీలు పెట్టుకోవటం తప్ప ఎమ్మెల్యే వెలగబెట్టింది ఏమీ లేదని విమర్శించారు. రానున్న రోజుల్లో ఇదే పరిస్థితి కొనసాగితే ప్రజా పోరాటానికి దిగుతామన్నారు. ఎమ్మెల్యే, కార్పొరేటర్లను ప్రజా కోర్టులో నిలదీస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, మేడ్చల్ జిల్లా అధికార ప్రతినిధి పట్లోళ్ల సాయినాథ్‌రెడ్డి, కేపీహెచ్‌బీ, బాలజీనగర్ డివిజన్ల అధ్యక్షులు గంధం రాజు, వినోద్‌కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను | బీఆర్ఎస్ ప్రభుత్వం అడ్డుకుంటోంది

కుత్బుల్లాపూర్: బీఆర్ఎస్ ప్రభుత్వం పేదకుల తెల్ల రేషన్‌కార్డులు ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వ పథకాలకు మోకాలడ్డుతోందని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు విజయశాంతి అన్నారు. కుత్బుల్లాపూర్ మున్సిపల్ కార్యాలయం ఎదుట సోమవారం ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు విజయశాంతితో పాటు మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ హాజరయ్యారు.

◆ ఈ సందర్భంగా విజయశాంతి మాట్లాడుతూ... డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నుంచి కేంద్ర ప్రభుత్వం అమలు పరుస్తున్న ఆయుష్మాన్ భారత్ వరకు అన్నింటికీ తెల్లరేషన్ కార్డు ఉంటేనే లబ్ధి పొందే అవకాశముందన్నారు. ఆయుష్మాన్ భారత్‌తో తెల్లరేషన్ కార్డున్న ప్రతి కుటుంబానికి సంవత్సరానికి రూ.5 లక్షల ఆరోగ్య బీమా వర్తిస్తుందన్నారు. అందుకే బీఆర్ఎస్ ప్రభుత్వం తెల్లరేషన్ కార్డులు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. అదే విధంగా పింఛన్ల దరఖాస్తులను సైతం నిలిపేసిందని ఆరోపించారు. తెల్లరేషన్ కార్డులు, పింఛన్లను 90 రోజుల్లోగా మంజూరు చేసి లబ్ధిదారులకు అందజేయకుంటే ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో సర్కిల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

◆ అనంతరం శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ... స్థానిక ఎమ్మెల్యే ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేస్తూ సీఎం, ఆయన కుమారుడికి భజనపరుడిగా మారాడన్నారు. సర్కిల్ కార్యాలయంలో వందలాది పింఛన్ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వాటిని మంజూరు చేయించే సత్తా ఎమ్మెల్యేకు లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆలయ భాస్కర్ రాజు గారుమాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు హరీష్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్‌రెడ్డి, గార్గే శ్రీనివాస్, పత్తి రఘుపతి, భానుచందర్, శ్రీధర్ వర్మ, డివిజన్ల బీజేపీ అధ్యక్షులు, ఓబీసీ మోర్చా నాయకులు, మహిళా కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



మహాధర్నాలో మాట్లాడుతున్న బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు విజయశాంతి

తొమ్మిదేళ్లుగా చేసిందేమీ లేదు

మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

చింతల్: కుత్బుల్లాపూర్ గోస – శ్రీశైలం అన్న భరోసా కార్యక్రమంలో భాగంగా చింతల్ డివిజన్ పరిధిలోని భగత్ సింగ్‌నగర్, దోభీఘాట్‌లో సోమవారం మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ పాదయాత్ర చేపట్టారు. భగత్‌సింగ్ నగర్‌లో గుంతలుగా మారిన రోడ్డును పరిశీలించిన ఆయన అధికారుల తీరును ఎండగట్టారు. పాదయాత్రలో భాగంగా స్థానికప్రజలు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు,, పెన్షన్లు, రేషన్ కార్డులు, రోడ్లు, డ్రైనేజీ తదితర సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దోభీఘాట్‌లో నెలకొన్న భూసమస్యను పరిష్కరించాలని రజక సంఘం నాయకులు కోరారు.

◆ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీఆర్ఎస్ ఎమ్మెల్యే వివేకానంద్ తొమ్మిదేళ్లుగా నియోజకవర్గానికి చేసిందేమీ లేదన్నారు. భగత్ సింగ్‌నగర్‌లో మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌ను ఎందుకు అందుబాటులోకి తీసుకురావడం లేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం యువతకు ఉద్యోగాలు ఇవ్వకుండా రోడ్డున పడేశారని ఆరోపించారు. కొలువులు రావాలంటే కమలం రావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కేకేఎం ట్రస్ట్ చైర్మన్ కూన శ్రీనివాస్‌గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి, జాయింట్ కన్వీనర్ రాముగౌడ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సదానందం, జిల్లా ఉపాధ్యక్షులు గరిగె శేఖర్ ముదిరాజ్, డివిజన్ ఇన్‌చార్జులు మోతె శ్రీనివాస్, బిల్లా వెంకటేష్, కృష్ణయాదవ్, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



భాగ్యనగర్‌కాలనీ: ఓ గుర్తు తెలియని వ్యక్తి ఎల్లమ్మ చెరువులో పడి మృతి చెందిన సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ వ్యక్తి చెరువులో శవమై తేలటంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి పరిశీలించారు. ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతుడి కుడి చేతిపై బాబా షాదుల్లా అని తెలుగులో టాటూ ఉన్నట్లు గుర్తించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నాణ్యతా ప్రమాణాలతో సీసీరోడ్లను నిర్మిస్తాం



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలో చేపట్టబోయే సీసీరోడ్డు నిర్మాణ పనులకు సోమవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ స్థానిక కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హెచ్ఎంటీ శాతవాహననగర్, అడ్డగుట్ట, హెచ్ఎంటీ హిల్స్, శ్రీనివాసకాలనీ, గౌతమి నగర్ కాలనీల్లో ఈ పనులు చేపడుతున్నామన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మార్గదర్శకంలో మంత్రి కేటీఆర్ సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని అన్నారు.

◆ అదే విధంగా హైదర్‌నగర్ డివిజన్‌లో అభివృద్ధికి బాటలు వేస్తూ సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసుకోవటం చాలా సంతోషకరంగా ఉందన్నారు. అదే విధంగా అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తామని తెలిపారు. సీసీరోడ్లను నాణ్యతా ప్రమాణాలతో నిర్మిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కాలనీ అసోసియేషన్ల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రూ.2.5లక్షల ఎల్ఓసీ పత్రం అందజేత



సరస్వతి భర్తకు ఎల్ఓసీ పత్రాన్ని అందజేస్తున్న గొట్టిముక్కల వెంకటేశ్వరరావు

కూకట్‌పల్లి: హౌసింగ్ బోర్డులో నివాసముండే వేమూరి సరస్వతి కొంత కాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆమెకు సర్జరీ, డయాలసిస్ చేయాల్సి ఉందని వైద్యులు సూచించారు. చికిత్స అయ్యే డబ్బు వారి వద్ద లేకపోవడంతో బీఆర్ఎస్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వరరావును సంప్రదించారు. ఆయన ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేయించారు. ఈ మేరకు సోమవారం మంజూరైన రూ.2.5లక్షల ఎల్ఓసీ పత్రాన్ని ఆమె భర్త కనకయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా కనకయ్య ముఖ్యమంత్రి కేసీఆర్‌కు, గొట్టిముక్కల వెంకటేశ్వరరావులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎర్ర కవాతును జయప్రదం చేయాలి

సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమామహేష్



జగద్గిరిగుట్ట: సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో జూన్4న కొత్తగూడెంలో లక్ష మంది కార్యకర్తలతో నిర్వహించనున్న ఎర్ర కవాతును జయప్రదం చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్ అన్నారు. సోమవారం జగద్గిరిగుట్ట లాస్ట్ బస్టాప్‌లో దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మోసం చేస్తున్నాయని అన్నారు. ఎర్ర కవాతుతో ప్రజలని అప్రమత్తం చేసి చైతన్యవంతులుగా తయారు చేస్తామన్నారు.

◆ ఈసారి ఎన్నికలలో కమ్యూనిస్టులు ఎక్కువ స్థానాల్లో పోటీ చేస్తారని తెలిపారు. ప్రజలకు విశ్వాసం కల్పించడానికి ఈ సభను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. సీపీఐ కార్యకర్తలు భారీగా తరలిరావాలని ఉమామహేష్ కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ స్వామి, హరినాథ్, ప్రవీన్, సదానంద్, రాములు, సహదేవ్, శ్రీనివాస్, నర్సయ్య, ఐలయ్య, బాలాజీ, వెంకటేష్, నాగయ్య, సామేల్, ఇమామ్, కయ్యూం, జార్జ్, యాదగిరి, ముసలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఒకరు దాడి చేసి చంపాలని మరొకరు ఎదురుదాడి చేయాలని స్కెచ్

- రెండు గ్యాంగ్‌లుగా ఏర్పడ్డ నిందితులు
- చాకచక్యంగా అరెస్టు చేసిన పోలీసులు



స్వాధీనం చేసుకున్న ఆయుధాలు



వివరాలు వెల్లడిస్తున్న బాలానగర్ ఏసీపీ గంగారాం, జగద్గిరిగుట్ట సీఐ క్రాంతికుమార్

జగద్గిరిగుట్ట: సోదరుడిని హత్య చేసిన వాడిని ఎలాగైనా చంపాలన్న కక్ష ఒకరిదైతే.. తనకు ఎదురు తిరుగుతే ఎవరినైనా చంపగలనని ధీమా ఇంకొకరిది. ఇలా ఈ రెండు గ్యాంగ్‌లుగా ఏర్పడ్డ వీరిని బాలానగర్ ఎస్ఓటీ బృందం, జగద్గిరిగుట్ట పోలీసులు చాకచక్యంతో అదుపులోకి తీసుకున్నారు. జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్‌లో సోమవారం జరిగిన సమావేశంలో బాలానగర్ ఏసీపీ గంగారాం వివరాలు వెల్లడించారు.

◆ జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో మార్చి 2021లో శ్రీనివాస‌నగర్‌లో లాస్ట్ బస్టాప్‌లో నవాజ్ అనే వ్యక్తి హత్యకు గురయ్యాడు. ఈ హత్య కేసులో ఇమ్రాన్ అతడి స్నేహితుడు ఖలీద్‌ను అరెస్టు చేసి జైలుకు తరలించారు.

◆ కొంత కాలం తర్వాత బెయిల్‌పై బయటకు వచ్చిన వారు ఇద్దరు మరో స్నేహితుడు శ్రీకాంత్‌తో కలిసి పలు నేరాలకు పాల్పడుతుండడంతో వారిపై రౌడీషీట్ తెరిచారు. కాగా తన సోదరుడు నవాజ్‌ను చంపిన ఇమ్రాన్‌ని ఎలాగైనా చంపాలని కక్ష పెంచుకున్నాడు అయాజ్.

◆ అయాజ్ తన స్నేహితులు రోహిత్ సింగ్, రోషన్ సింగ్‌తో సహాయంతో ఇమ్రాన్‌ని ఎలాగైనా హత్య చేయాలని పథకం వేసారు. తనను హత్య చేయడానికి ప్రయత్నిస్తున్నారని తెలుసుకున్న ఇమ్రాన్ ముందు వారిపైనే ఎదురుదాడి చేయాలనుకున్నారు.

◆ ఇలా ఆ రెండు గ్యాంగ్‌లు ఒకరికి ఒకరు దాడి చేసుకోవడానికి మారణాయుధాలతో తిరగడం మొదలుపెట్టారు. కాగా ఆదివారం రాత్రి సమయంలో రింగ్ బస్తీలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇమ్రాన్, ఖలీద్, శ్రీకాంత్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి కంట్రీమేడ్ పిస్టల్ బుల్లెట్స్, నకిలీ గన్, కత్తులు స్వాధీనం చేసుకున్నారు.

◆ ఇక రెండో గ్యాంగ్ అయాజ్ పరారీలో ఉండగా, రోహిత్ సింగ్, రోషన్ సింగ్‌ను సోమవారం ఉదయం అదుపులోకి తీసుకొని వీరి వద్ద నుంచి రెండు కత్తులు స్వాధీనం చేసుకున్నారు. రెండు గ్యాంగ్‌లపై రౌడీషీట్ తెరిచి పీడీయాక్ట్ నమోదు చేసేందుకు ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని ఏసీపీ గంగారాం తెలిపారు.